ప్రజాశక్తి
శుక్రవారం 4 జులై 2025
5
విజయనగరం

బిసిసిఐ అంపైర్ పరీక్షల్లో విజయ్ ఉత్తీర్ణత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిసిసిఐ ఆధ్వర్యంలో గత నెలలో అహ్మదాబాద్‌లో నిర్వహించిన అంపైర్ల పరీక్షల్లో విజయనగరానికి చెందిన తోట విజయ్ ఉత్తీర్ణత సాధించారు. బిసిసిఐ అంపైర్ల పరీక్ష ఉత్తీర్ణత కావడంతో ఇకనుండి దేశవాళీ క్రికెట్ మ్యాచులు.. రంజీ ట్రోఫీ, ఐపిఎల్, అంతర్రాష్ట్ర క్రికెట్ మ్యాచులకు అంపైరింగ్ చేసే అవకాశం లభిస్తుంది. జిల్లా చరిత్రలో తోట విజయ్ బిసిసిఐ అంపైర్ సర్టిఫికేషన్ పొందిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందడం విశేషం. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ నుంచి అర్హత పొందిన ఏకైక అభ్యర్థి కూడా ఆయనే. విజయ్ సాధించిన ఘనత విజయనగరం క్రికెట్‌కు గర్వకారణమే కాకుండా భవిష్యత్ అంపైర్లకు ప్రేరణగా నిలుస్తుంది. ఇప్పటికే విజయ్ అంతర్జాతీయ మ్యాచులకు స్కోరర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా విజయ్‌కు జిల్లా క్రికెట్ అసోసియేషన్, నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

స్వర్ణాంధ్రలో భాగస్వాములు కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత
- పి-4లో భాగంగా 264 కుటుంబాలను దత్తత తీసుకుంటా : మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం విజన్ ప్రణాళిక రూపొందించిందని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళిక , పి.4 కార్యక్రమాలపై మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి వచ్చే ఐదేళ్లకు ఒక ప్రణాళిక, 2047 నాటికి మరో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో వ్యవసాయంలో రెట్టింపు అభివృద్ధి ని సాధించాలనే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందుకోసం వ్యవసాయ, అనుబంధ రంగాలలో సాగులో లేకుండా ఉన్న భూములను గుర్తించి , ప్రత్యామ్నాయ పంటలు, అంతర పంటలు వేసి సాగు పెంచి మార్కెటింగ్ కు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందుకోసం వ్యవసాయ, అనుబంధ శాఖలు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సమగ్ర ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు.

ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటలకు ఎక్కువగా అవకాశం ఉందని, అందులో వాణిజ్య పంటలకు ఎక్కువ గిరాకీ ఉంటుందని , ఈ పంటల పై ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తోందని , దీనిపై విస్తృత ప్రచారం జరగాలని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం క్లస్టర్ మాపింగ్ కింద సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో మ్యాంగో క్లస్టర్ మాపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. సర్వీస్ సెక్టార్ కింద పర్యాటక రంగం లో సన్ రే రిసార్ట్స్ 150 కోట్లతో , ఎయిర్ పోర్ట్‌లో జిఎంఆర్ సంస్థ రూ.150కోట్లతో, అదాని గ్రూప్ రూ.100కోట్లతో హోటళ్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఎకో టూరిజం కింద తాటిపూడి జలాశయాన్నిఅభివృద్ధి చేయడానికి రూ.23కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ జిల్లా పర్యాటక కేంద్రాలను వెబ్‌సైటు లో పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని తెలిపారు.

పి-4 లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 264 కుటుంబాల దత్తత

పి.4 లో భాగంగా ఒక కుటుంబాన్ని దత్తత తీసుకున్నట్లు మంత్రి అనిత వెల్లడించారు. పి.4 అంటే ఆర్థిక అంశాలే కాదని, విద్య తదితర ఆర్థికేతర అంశాలలో కూడా సహాయ పడవచ్చునని తెలిపారు. జిల్లాలో 6700 బంగారు కుటుంబాలు ఉన్నాయని, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియోజకవర్గం లో 264 పోలింగ్ బూత్ లు ఉన్నాయని, ప్రతి ఒక్క బూత్ నుండి ఒక కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని వెల్లడించారు. డిసిఎంఎస్. చైర్మన్ గొంప కృష్ణ మాట్లాడుతూ 20 కుటుంబాలను పి 4 కింద దత్తత తీసుకుంటానన్నారు. కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లాలో బంగారు కుటుంబాలు , మార్గదర్శులు వివరాలతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సిపిఒకు సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

రాష్ట్రంలో, జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులంతా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వసతి గృహాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం లో ఒక డిజిటల్ ల్యాబ్ , యోగా సెంటర్, రీడింగ్ రూమ్‌ను ఎంపి నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశం లో ఎంఎల్‌సి లు రఘు రాజు, గాదె శ్రీనివాసులు నాయుడు, ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి గజపతి రాజు, లోకం నాగ మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, జెసి సేతు మాధవన్, ఎస్.పి వకుల్ జిందాల్ , సిపిఒ బాలాజీ, జిల్లా అధికారులు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ యశస్వి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడుల కేసుల్లో నిందితులను శిక్షించడంలో జిల్లానే ప్రథమం

హోంమంత్రి అనిత

కంటోన్మెంట్ : మహిళలపై జరిగే దాడుల్లో నమోదైన కేసుల్లో నిందితులను శిక్షించడంలో రాష్ట్రంలోనే విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎస్‌పి, ఇతర పోలీసు అధికారులు మహిళల భద్రతకు చేపడుతున్న చర్యలు ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు. శక్తి మొబైల్ యాప్‌లో ఉండే ఎస్ఒఎస్, సేఫ్ ట్రావెల్ ఆప్షన్ల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో యువత సహకారంతో రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌ను, వాల్‌పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రతకు రాష్ట్రంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నామన్నారు. యువత, పోలీసులు సంయుక్తంగా షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, గాదె శ్రీనివాసులు నాయుడు, కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, జెసి సేతు మాధవ్, ఎఎస్‌పి పి.సౌమ్యలత, తదితరులు పాల్గొన్నారు.

ఇది దగా ప్రభుత్వం

ప్రభుత్వ మెడలు వంచైనా హామీలు అమలు చేయిస్తాం : వైసిపి విస్తృత సమావేశంలో బొత్స



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నేత బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు చేయకుండా ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలను దగా చేసిందని శాసన మండలి ప్రతిపక్ష వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశం స్థానిక జగన్నాథ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికను అమలు చేస్తారని నమ్మిన ప్రజలకు మోసం చేసిందన్నారు. అధికార పక్షం ఇచ్చిన వాగ్దానాలను మెడలు వంచి అమలు చేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీపై ఉందన్నారు. హామీలు అమలు చేయాలని ప్రతిపక్ష పార్టీగా అడిగితే మమ్మల్ని తాట తీస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఎవరు తాట తీస్తారో ప్రజలే తేలుస్తారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి మహిళలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి మోసగించారన్నారు. రైతులకు ఇస్తామన్నా అన్నదాత సుఖీభవ డబ్బులు ఏవని ప్రశ్నించారు. చంద్రబాబు 100 అబద్ధాలు ఆడితే లోకేష్ 200 అబద్ధాలు ఆడుతున్నారన్నారు. హామీలపై ప్రజలు ప్రశ్నించే విధంగా అవగాహన ,చైతన్యం కలిగించాలన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నియోజవర్గాల్లో, మండల స్థాయిలో ,గ్రామ స్థాయిలో సమావేశాలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. 'బాబు ష్యూరిటీ.. బాబు మోసం' కార్యక్రమం పేరిట ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

నిబంధనల పేరుతో పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నం

వైసిపి ఉత్తరాంధ్ర కన్వీనర్ ,మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏరు దాటాక బోడి మల్లన్న చందంగా ఉందన్నారు. ఒక్క గ్యాస్ సిలెండర్ తప్ప ఏడాది కాలంలో ఏమీ ఇవ్వలేదన్నారు. ప్రతి పథకానికి షరతులు,మినహాయింపులు చేస్తూ కోతలు పెడుతున్నారన్నారు.సర్పంచ్‌ల పిల్లలకు తల్లికి వందనం పథకం ఇవ్వలేదన్నారు. ఉపాధి హామీలో కోతలు పెడుతున్నారన్నారు. తల్లికి వందనం,రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో కోతలు పెట్టి లక్షలాది మందిని కుదించారన్నారు. నిబంధనలు పేరుతో పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్న మనం ప్రజలు తరుపున నిలబడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజలికిచ్చిన హామీలు అమలుపై నిలదీయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను దగా చేసిందన్నారు. నేడు వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయన్నారు. గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రజలిచ్చిన హామీలు అమలు చేయడంలో మోసం చేసిన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎమ్మెల్యేలు శంబంగి చిన అప్పలనాయుడు, బొత్స.అప్పలనర్సయ్య, బడుకొండ అప్పలనాయుడు, మాజీ జెడ్‌పి చైర్మన్ శోభా స్వాతిరాణి, శోభా హైమవతి, మేయర్ విజయలక్ష్మి, జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు

- ఎస్‌సి,ఎస్‌టిల శ్మశానవాటికలకు స్థలాలు : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీలో పలు అంశాలపై చర్చ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఎస్‌సి, ఎస్‌టిలకు శ్మశానవాటికలు లేనిచోట వెంటనే స్థలాలను కేటాయించాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. స్థలాలను గుర్తించే ప్రక్రియను వారం పది రోజుల్లో పూర్తిచేయాలని ఆర్‌డిఒలకు సూచించారు. జిల్లా స్థాయి ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నిందితులపై వెంటనే కేసులను నమోదు చేయడంతోపాటు బాధితులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయాన్ని, పరిహారాన్ని వేగంగా అందించాలని సూచించారు. ఇప్పటివరకు బకాయి ఉన్న పరిహారాన్ని ఇప్పిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతుకు సుమారు రూ.4 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని చెప్పారు. సమావేశంలో ఎస్‌పి వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళి, సాంఘిక సంక్షేమశాఖ డిడి ఎం.అన్నపూర్ణ, కమిటీ అధికార సభ్యులు, అనధికార సభ్యులు బసవ సూర్యనారాయణ, సున్నపు రామస్వామి, చంపి సన్యాసిరావు, మజ్జి గణపతి, ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

రూ.4.30 కోట్లతో గురుకులం అభివృద్ధి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.4.30కోట్లతో ప్రతిపాదనలు చేసి, ఆ లేఖను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే బేబినాయన అందించారు. అమరావతిలో గురువారం లోకేష్‌ను కలిశారు. గురుకులంలో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు బేబినాయన చెప్పారు.

మంత్రికి వినతి అందిస్తున్న బేబినాయన

కలెక్టర్ ఆదేశాలా.. తూచ్!

కంచే చేను మేసిన చందంగా ఉంది ఆర్‌టిసి శృంగవరపుకోట అధికారుల తీరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా విధానాలతో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతోమంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారు. స్థానిక అధికారుల తీరుతో కొంతమంది విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు ఆర్‌టిసి డిపో అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అందుకేనేమో కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు.

- ఖాతరు చేయని ఆర్‌టిసి అధికారులు
- బడిబస్సు కోసం విద్యార్థుల ఎదురుచూపులు
- ప్రయివేటు పాఠశాలలకు సహకరిస్తున్నారంటూ ఆరోపణలు

రూటు పరిశీలిస్తున్న ఆర్‌టిసి అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 250 మంది, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 480 మంది, బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలలో 670 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు మండలంలోని సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. వీరి కోసం ఆర్‌టిసి బడి బస్సు నడపక పోవడంతో ప్రయివేటు వాహనాల ద్వారా నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల తల్లిదండ్రులపై అదనపు భారం పడుతోంది. ఆర్‌టిసి శృంగవరపుకోట డిపో నుంచి సోంపురం, జాకేరు, కరకవలస, మారిక, వెంకయ్యపాలెం, పోతుబంది పాలెం నుంచి చామలాపల్లి, దబ్బిరాజుపేట మీదుగా ఆర్‌టిసి బడి బస్సులను నడిపితే వందలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. ఆర్‌టిసి శృంగవరపుకోట డిపో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

వినతులిచ్చినా.. ఆందోళన చేసినా..

వేపాడ, బక్కునాయుడుపేటలోని పాఠశాలలు, కళాశాలకు బడిబస్సు నడపాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు.. 2022 నుంచి పలుమార్లు జిల్లా కలెక్టర్లకు, ఆర్‌టిసి జోనల్ చైర్మన్‌కు వినతులు అందజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళనలు సైతం చేశారు. చివరికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌నూ కలిసి, విద్యార్థుల అవస్థలు, తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని వివరించారు. దీనివల్ల ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందని విన్నవించారు. మంత్రి లోకేష్ స్పందించి, బడి బస్సు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. అధికారులకు ఉత్తర్వులు జారీ చేస్తామనీ చెప్పారు. ఆర్‌టిసి జోనల్ చైర్మన్ దున్నుదొర, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్.. స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది పాఠశాలల పున:ప్రారంభానికైనా బస్సు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభించి 20 రోజులు గడిచిపోయాయి. అయినా ఆర్‌టిసి డిపో అధికారుల్లో చలనం లేదు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేయడం గమనార్హం.

ఆ వాహనాలకు లేని ఇబ్బంది.. బడి బస్సుకు ఎందుకు?

మండలంలో బడిబస్సు కోసం ఎదురుచూపులు చూస్తున్న విద్యార్థులున్న గ్రామాల మీదుగా నిత్యం ప్రయివేటు విద్యాసంస్థల బస్సులు, క్వారీ లారీలు పదుల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ వాహనాలన్నీ బాగానే నడుస్తున్నాయి. అటువంటి మార్గం బడిబస్సు నడిపేందుకు అనుకూలంగా లేదని ఆర్‌టిసి డిపో అధికారులు చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే ఐదు సార్లు రూట్ సర్వే కూడా చేశారు. అయినా బస్సు నడిపేందుకు మాత్రం ముందుకు రావడం లేదు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలకు ఆర్‌టిసి అధికారులు సహకరించడం వల్లే బడిబస్సు నడపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్‌టిసి అధికారుల తీరుతో పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బడిబస్సు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్తమ సేవలు అందించాలి

- ఇన్‌ఛార్జి మంత్రి అనిత
- 67 మందికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉత్తమ సేవలను అందించడం ద్వారా తాము పనిచేస్తున్న శాఖలకు, ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులను నిర్వర్తిస్తూ మృతి చెందిన వారి వారసులు 67 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించారు. వీరికి కలెక్టర్ ఛాంబర్లో గురువారం నియామక పత్రాలను మంత్రి అనిత అందజేశారు. రెవెన్యూశాఖలో పనిచేస్తూ 16 మంది, ఆర్టిసిలో పనిచేస్తూ 10 మందితోపాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో విధులను నిర్వర్తిస్తూ మృతి చెందిన వారి కుటుంబాల వారిని ఈ ఉద్యోగాల్లో నియమించారు. వీరిలో 63 మందికి జూనియర్ అసిస్టెంట్ / టైపిస్టుగా, నలుగురిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, మార్కెఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున, డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కష్ణ, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్‌ఒ మురళి, కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంట స్తంభం వద్ద పెద్ద కాలువలో పేరుకుపోయిన చెత్త

ఎన్నాళ్లీ దుస్థితి?

- అధ్వానంగా కాలువలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- కలగా మిగిలిన భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ

చరిత్ర కలిగిన విజయనగరంలో వందేళ్ల క్రితం నాటి కాలువ వ్యవస్థ తప్ప కొత్తగా అభివృద్ధి చేసింది లేదు. పాలకులు, అధికారులు మారుతున్నా కాలువ వ్యవస్థ మాత్రం అలాగే ఉంది. ఉన్న కాలువలకు మరమ్మతులు చేయడం తప్ప పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలువ వ్యవస్థలో మార్పు తీసుకు రావడం లేదు. ఈనేపథ్యంలోనే కొన్ని ప్రాంతాల్లో కాలువలు శిథిలావస్థకు చేరుకొని చెత్తా చెదారం పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. వర్షం అధికంగా పడితే తాత్కాలింగా చర్యలు తీసుకోవడం తప్ప కాలువ వ్యవస్థ మెరుగుదలకు చేపట్టిన చర్యలు మాత్రం శూన్యంగానే ఉన్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాలువలు మరింత అధ్వానంగా తయారయ్యాయి. విజయనగరం కాలువ వ్యవస్థ డొల్ల తనం బయట పడుతుంది.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థ పరిధిలో మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చెత్తాచెదారంతో నిండిన పరిస్థితి, మురుగు కదలదు వదలదు అన్న చందంగా పరిస్థితి తయారైంది. సాధారణంగా ఏటా వర్షాకాలం ముందే కాలువల్లో పూడిక తొలగించాల్సి ఉంటుంది. కానీ పూడికలు తీసి చేతులు దులుపుకోవడం తప్ప కాలువ వ్యవస్థ మెరుగుదలకు తీసుకున్న చర్యలు కనిపించడం లేదు. ప్రధాన కాలువలు పూడికతో నిండిపోయినా ఆ దిశగా చర్యలు అంత అంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో చిన్న పాటి వర్షం కురిసినా.. ఆయా ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. వర్షం పడితేచాలు మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాలు చెరువును తలపించే విధంగా మారిపోతున్నాయి. 11 ఏళ్ల క్రితం సిటీ స్టాండ్‌కు వెళ్లే వారిలో కర్రబడ్డీల వద్ద ఉన్న కాలువలో వరద ఉద్ధతికి ఓ మహిళ కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ ఘటన సంచలనం సృష్టించింది. ఇప్పటికీ ఆ కాలువ అధ్వాన్నంగా ఉంది. నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలో కాలువలతో పాటు గంటస్తంభం, పిడబ్ల్యు మార్కెట్, సిటీ స్టాండ్, లంక వీధి వద్ద కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి. తోటపాలెం నుంచి ప్రదీప్‌నగర్‌కు వెళ్లే దారిలో పాఠశాల నుంచి వైఎస్‌ఆర్ కాలనీ వరకు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ట్యాంక్ బండ్ రోడ్ ఎల్‌ఐసి కార్యాయం వద్ద నుంచి నాయుడు కాలనీ, వినాయక నగర్, పద్మావతినగర్ మీదుగా ధర్మవరం వరకు 3 కి.మీ. పెద్దకాలువలు శిథిలావస్థలో ఉన్నాయి. వర్షం కురిస్తే, సిటీ స్టాండ్ నగర పాలిక సంస్థ కార్యలయం, గంటస్తంభం, పార్కు గేటు కూడలి ముంపునకు గురవుతున్నాయి.

ఈ నేపథ్యంలో కొంతకాలం క్రితం ప్రతిపాదనలు తయారు చేసిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ కలగానే మిగిలిపోయింది. కేవలం డిపిఆర్ తయారు వరకు పరిమితమైంది తప్ప ఆచరణకు నోచుకోలేదు. కాలువ వ్యవస్థ మెరుగు కోసం భూగర్భ కాలువ వ్యవస్థ నిర్మాణం జరిగితే తప్ప పరిష్కారం లభించదు.కొత్తగా ఏర్పడిన పాలకులైనా వీటిపై దృష్టి పెడతారో లేదో చూడాలి.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

రహదారులపై ఆక్రమణలు తొలగించాలి : జెసి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలు తొలగించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను అదేశించారు. జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించారు. సమావేశంలో జెసి మాట్లాడుతూ రహదారిపై ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, నిబంధనలు కఠినంగా అమలు చేయాలన్నారు. రహదారులు, జంక్షన్లు, బ్లాక్ స్పాట్లు, పాఠశాలల వద్ద ఆక్రమణలు వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారిపై గ్రామాల వద్ద గార్డ్ రైలింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలని, అనధికార పార్కింగ్ నివారించాలని, వ్యతిరేక దిశలో డ్రైవింగ్‌పై చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులకు సూచించారు. ఐఆర్‌ఎడి యాప్‌లో రోడ్డు ప్రమాద వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఆర్అండ్‌బి, పోలీసు, రవాణా, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త బృందాలు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఆర్అండ్‌బి ఎస్‌ఇ కె. కాంతిమతి, జిల్లా రవాణా అధికారి డి.మణికుమార్, డిఎస్‌పి ఎం.శ్రీనివాస్ రావు, డిసిహెచ్ఎస్ ఎన్.పి. పద్మశ్రీరాణి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెండెంట్ ఎస్.అప్పలనాయుడు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎం.అప్పారావు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ

పరిసరాల శుభ్రతతోనే రోగాలు దూరం

జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ

ప్రజాశక్తి-కొత్తవలస

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు రావని జెడ్‌పి సిఇఒ బి.వి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అప్పన్నపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను, తాగునీటి పథకాలను పరిశీలించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు. అనంతరం నిమ్మలపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని జాకేరు, కరకవలస గ్రామాల్లో తాగునీటి పథకాలను ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీదేవి పరిశీలించారు. ప్రతిఒక్కరూ వేడి నీరు తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ గొర్లె రాంబాబు, జాకేరు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, నాయకులు అప్పలనాయుడు. కరకవలస ఉపసర్పంచ్ దుల్ల అప్పన్న, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు పాల్గొన్నారు.

ఎంఎంసి వైస్‌చైర్మన్‌గా చంద్రనాయుడు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా దుప్పాడ గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల నాయకుడు బొబ్బాది చంద్రనాయుడును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. వైస్ చైర్మన్‌గా నియమించిన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి విజయలక్ష్మి అదితి విజయలక్ష్మికి, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్,జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యసస్వినికి ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు

జగనన్న కాలనీ భూముల ఆక్రమణ

బొబ్బిలి :స్థానిక మున్సిపాలిటీలోని రామన్నదొరవలస వద్ద గల జగనన్న కాలనీ భూములను కొందరు ఆక్రమించి మొక్కలు నాటారు. ప్రభుత్వ స్థలంలో మొక్కలు నాటడంతో తహశీల్దార్ ఎం.శ్రీను ఆదేశాల మేరకు ఆర్ఐ కొల్లి రాంకుమార్ ఆక్రమణకు గురైన భూములను పరిశీలించి నాటిన మొక్కలను తొలగించారు. ప్రభుత్వ స్థలాలు, భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు

ప్రజాశక్తి-రేగిడి

నవధాన్యాల సాగుతో నేల తల్లి బాగుంటుందని వ్యవసాయ శాఖ అధికారులు ఆర్‌టిఎల్ హేమ సుందర్, ఎడి డిఇ స్వామి నాయుడు అన్నారు. గుల్లపాడు గ్రామ పంచాయతీ లో నవధాన్యాలు సాగును పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32 రకాల నవధాన్యాల కషాయాలతో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. గత 4 సంవత్సరాల నుంచి నవధాన్యాలు వేసిన ఫీల్డ్ లో జీవవైవిధ్యం పెరిగిందని, తద్వారా ప్రధాన పంటకు పోషకాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎంటి పద్మ, ఐసిఆర్‌జి రవి, పి గౌరీశ్వరరావు, పి సురేష్ ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జి ఎడి మజ్జి శ్యామసుందర్ అన్నారు. పట్టణంలోని ఎరువుల షాపులను గురువారం ఆయన తనిఖీ చేశారు. రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. రైతు సేవా కేంద్రాలలో యూరియా 300 టన్నులు, డిఎపి 276, ప్రయివేట్ షాపుల్లో యూరియా 191 టన్నులు, డిఎపి 293 టన్నులు సిద్ధం చేశామన్నారు. రైతు సేవా కేంద్రాలలో ఈ నెల పదో తేది తర్వాత ఎరువుల అమ్మకాలు చేపడతామన్నారు.

పెంచిన సర్దుబాటు ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పెంచిన విద్యుత్తు సర్దుబాటు చార్జీలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్తు ఛార్జీల పెంపుదలను తీవ్రంగా వ్యతిరేకించారని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటును అడ్డుకోవాలని, అవసరమైతే పగలగొట్టాలని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ప్రజలపై విద్యుత్తు భారాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గొల్లపల్లి తౌడు పాల్గొన్నారు.

ఎంఆర్ ఫార్మసీ కళాశాలలో ఇన్వెస్ట్‌మెంట్ అవేర్నెస్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఎంటర్ప్రెనర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ , బ్యాంకింగ్, ఫైనాన్స్ అండ్ ఇన్సూరెన్స్ స్కిల్ సెక్టార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఇన్వెస్ట్‌మెంట్ అవగాహన సదస్సు జరిగింది. హెచ్‌డిఎఫ్‌సి మ్యూచ్‌వల్ ఫండ్ (విశాఖ)బ్రాంచి మేనేజర్ సిహెచ్. శివ నాగేశ్వరరావు వివిధ రకాల పెట్టుబడి ప్రణాళికలపై వినూత్నంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య విధానాన్ని గమనించారు.అలాగే పలు దుకాణాలకు వెళ్లి ప్లాస్టిక్ విక్రయాలు సాగిస్తున్నారా లేదా అన్నది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించడం కానీ వినియోగించడం గాని చేయొద్దన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ

నగరంలో వివిధ అభివృద్ధి పనులను డిఇ శ్రీనివాసరావు, ఎఇ సుధాకర్ పరిశీలించారు. 42వ డివిజన్ లోని కామాక్షి నగర్ లో సిసి డ్రైన్ నిర్మాణ పనులను, ఆదిత్య థియేటర్ వద్ద కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించారు.

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి-డెంకాడ

పేకాట ఆడుతున్న వారిపై ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు తన సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. అక్కివరం గ్రామం సమీపంలో ఉన్న బిబిజి ప్రైవేట్ లేఔట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో వెళ్లి దాడి చేసి పేకాట ఆడుతున్న 8 మందిని ఎస్ఐ పట్టుకున్నారు.వారి నుంచి రూ.15,100 నగదు, రెండు ఆటోలు, నాలుగు మోటార్ సైకిళ్లు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగకు రెండేళ్ల జైలు

రామభద్రపురం : 2024వ సంవత్సరంలో ఎస్‌బిఐ సేవా కేంద్రంలోను, ఆరికతోటలో మరో ఇంటిలోను చోరీకి పాల్పడిన నిందితుడు పోరాం గ్రామానికి చెందిన జోకాడ భగవాన్‌కు రెండేళ్ల పదినెలలు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

అసెంబ్లీకి వచ్చేందుకు జగన్‌కు భయం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి-బొండపల్లి

అసెంబ్లీకి రావడానికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భయపడుతున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం బొండపల్లి మండల కేంద్రంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పల్లెలు వరకు చేరాలన్నదే ధ్యేయమన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉండి బయటకు రావడానికి పరదాలు కట్టించుకున్నాడని, షాపులు మూయించుకున్నాడని విమర్శించారు. అసెంబ్లీకి రావడానికే భయపడినోడు-చంద్రబాబు కోసం మాట్లాడుతున్నారని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి బయటకు వస్తే తామేమీ ఇబ్బంది పెట్టలేదన్నారు. ఒకరోజు గంజాయి బ్యాచ్ ను పరామర్శించడానికి వెళ్లారని, ఆరోజు వైసిపి కార్యకర్తలు పోలీసులపై రాళ్ళు విసిరారని, మరోసారి బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకొని ఆత్మహత్య చేసుకున్న వాడికి కూడా విగ్రహాలు కడితే ప్రారంభించడానికి వెళ్లారని విమర్శించారు. మాజీ సిఎం స్థాయిలో ఉన్న వారు ఇలాంటి కార్యక్రమాలకు వెళ్లడం మన రాష్ట్రంలోనే చూస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇది పేద ప్రజల ప్రభుత్వం : ఎమ్మెల్యే

రేగిడి :పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఇది పేద ప్రజల ప్రభుత్వమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. కోడిశ, కందిశ, తునివాడ, వేంకంపేట గ్రామాల్లో సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, నారు జనార్ధన రావు, పాలూరి రామినాయుడు, రమేష్ నాయుడు, ధనంజయరావు, కడగల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : మండలంలోని రామచంద్రపురంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ఆధ్వర్యాన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి భాస్కర్ రావు, టిడిపి నాయకులు బడి సురేష్, వెంకటేష్, బొంతు త్రినాథ్ పాల్గొన్నారు.

రేగిడి: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళి

లక్కవరపుకోట: కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

లక్కవరపుకోట : మండల కేంద్రంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో కొత్తవలస ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ఈశ్వరరావు, మాజీ ఎంపిపి కొల్లి వెంకట రమణమూర్తి, లక్కవరపుకోట సర్పంచ్ కె.పార్వతి, పార్టీ సీనియర్ నాయకులు శ్రీనాథ్, పెద్దబాబు, తలారి మాజీ సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, మాజీ ఎంపిటిసి రాముడు, తెలుగు యువత అధ్యక్షులు శ్రీనాథ్, రాజేష్, చప్ప దేముడు పాల్గొన్నారు.

జనసేన ఎమ్మెల్యేకి టిడిపి నాయకుల షాక్

అర్థాంతరంగా ఆగిపోయిన ఫైర్‌స్టేషన్ శంకుస్థాపన

ముదురుతున్న ఆధిపత్య పోరు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని ఫైర్‌స్టేషన్ శంకుస్థాపనను వాయిదా వేయించి మరోసారి ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి టిడిపి నేతలు షాక్ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నియోజకవర్గం కూటమిలో కుమ్ములాటలు అందరికీ తెలిసిందే. తరుచూ జనసేన ఎమ్మెల్యేకి, టిడిపి నేతలకు మధ్య ఆధిపత్య పోరు బయట పడుతూనే ఉంది. అయితే అది చినికి చినికి గాలివానలా మారింది. ఇటీవల ఎమ్మెల్యేకు తెలియకుండానే నియోజకవర్గంలో తహశీల్దార్లను బదిలీ చేసి ఆమెకు ఆందోళన కలిగించారు. నిన్న నెల్లిమర్ల నగర పంచాయతీ సమావేశానికి టిడిపి నేతలు డుమ్మా కొట్టి ఎమ్మెల్యేకి అసహనం తెప్పించారు. ఇప్పుడు మండలంలో ఫైర్ స్టేషన్ శంకుస్థాపనను నిలుపుదల చేయించి మరోసారి వారిదే పైచేయి అనిపించుకున్నారు. దీంతో ఎమ్మెల్యే ఆదిపత్యానికి బ్రేకులు వేశారన్న చర్చ నియోజకవర్గంలో ఊపందుకుంది. వరుసగా టిడిపి నేతలు ఎదురుదాడి ఎమ్మెల్యేకి కంటిమీద కునుకు లేకుండా చేస్తోందని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ విషయం అధిష్టానం దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది.

మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడుతో పాటు భోగాపురం, పూసపాటిరేగ మండలాల ప్రజల చిరకాల వాంఛ తీరంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు. కూటమి ప్రభుత్వం దాన్ని మంజూరు చేయడంతో మూడు నెలలు ముందే శంకుస్థాపన కార్యక్రమం జరగాల్సి ఉంది. కానీ ఎమ్మెల్యే ఎందుకో వాయిదా వేసుకుంటూ వచ్చారట. ఎట్టకేలకు గురువారం మండలంలోని కొప్పెర్లలో శంకుస్థాపన జరుగుతోందని, ఇంచార్జి మంత్రి వంగలపూడి అనితతో పాటు జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరవుతారని ఎమ్మెల్యే కార్యాలయం నుండి ప్రకటన వెలువడింది. ఈ విషయం నియోజకవర్గంలో టిడిపి నేతలకు నచ్చలేదట. తమకు తెలియకుండా ఎమ్మెల్యే శంకుస్థాపన డేట్ ఎలా నిర్ణయిస్తారని, శంకుస్థాపన ఆపాలని టిడిపి పైస్థాయి నాయకుల వద్ద మొరపెట్టుకున్నారట. దీంతో కొన్ని గంటల ముందు శంకుస్థాపన కార్యక్రమం అర్ధాంతరంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు. టిడిపి నేతలైతే శంకుస్థాపన వాయిదా వేస్తున్నట్లు బుధవారమే ప్రచారం చేశారు. దీంతో టిడిపి నాయకులు మాటే నియోజకవర్గంలో చెల్లుబాటు అవుతుందా అనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేను అడుగడుగునా అవమానిస్తున్నారన్న దానిపై జనసేన నాయకులు టిడిపి నాయకులపై కారాలు మిరియాలు నూరుతున్నారు.కూటమి పొత్తుకు తూట్లు పొడుస్తున్నారని ఒకరిపై ఒకరు ఇరుపార్టీల నాయకులూ బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. ఇలా అయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి నియోజకవర్గంలో పెద్ద దెబ్బేనని అంటున్నారు. ఈ ఫైర్ స్టేషన్ శంకుస్థాపన వాయిదా నియోజకవర్గంలో మంటలు రేపుతోంది. పెద్దలు కలుగజేసుకొని ఎలా ఆర్పుతారో వేచి చూడాల్సిందే.

నేడు, రేపు నిరసన కార్యక్రమాలు

ఉచిత బస్సుతో ఆర్‌టిసికి ఇబ్బందులు

ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

పలు డిమాండ్ల సాధనకు ఈనెల 4,5 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్‌టిసి డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆర్‌టిసిఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పి. భానుమూర్తి తెలిపారు. గురువారం విజయనగరం ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 నుంచి 2025 జూన్ రెండు వరకు రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు ఎటువంటి బెనిఫిట్స్ గాని, సరెండర్ లీవ్‌లు, గ్రాట్యుటీ, పిఎఫ్ ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ప్రభుత్వం నుంచి ఈ బెనిఫిట్స్ రాకపోవడంతో రిటైర్డు ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రవేశ పెడుతుందని, దీనివల్ల ఆర్‌టిసి ఆర్థిక ఇబ్బందులకు గురవుతుందని అన్నారు. బస్సుల కొరత, సిబ్బంది కొరత, అవసరమైన సామాగ్రి అందుబాటులో లేవన్నారు. ఈ పథకం వల్ల ఆర్‌టిసి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఉచిత ప్రయాణం స్కీం సక్సెస్ కావాలంటే వెంటనే కాలం చెల్లిని బస్సులు స్థానంలో కొత్త బస్సులు ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జి. రవికుమార్. డిపో అధ్యక్షులు ఎన్ స్వామి, డిపో కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి సిహెచ్ పి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పి.భానుమూర్తి

ఎండిఎం కార్మికుల సమ్మెనోటీసు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నాలుగు లేబర్ కోడ్లు రద్దు, కనీస వేతనాలు, ప్రభుత్వ రంగ పరిరక్షణ, ఉద్యోగ భద్రత, ఉపాధి కల్పన , రైతు పండించే పంటలు గిట్టుబాటు ధర చట్టం, సామాజిక భద్రత తదితర డిమాండ్లపై కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 9న చేపడుతున్న సమ్మెలో పాల్గొంటామని మధ్యాహ్న భోజన కార్మికులు,స్కూలు ఆయాలు గురువారం ఎంఇఒకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, వై.నందిని, ఉమా, సత్యవతి, ముత్యం, సత్య రాధా సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు సమ్మెనోటీసు అందజేత

డెంకాడ : దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని భోగాపురం ఎంఇఒకు గురువారం మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నోటీసు అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సభ్యులు బి. సూర్యనారాయణ, మధ్యాహ్న భోజన కార్మికులు సంఘ నాయకులు పెద్ద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ : సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొంటున్నట్లు సిఐటియు మండల అధ్యక్షులు పి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యాన మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఇఒ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఎండిఎం నిర్వాహకులు లెంక దుర్గ, ఎం.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

చాలీచాలని కూలి డబ్బులతో తమ కుటుంబాలను పోషించుకుంటున్న టు వీలర్స్, త్రీ వీలర్స్, ఫోర్ వీలర్స్ మోటార్ మెకానిక్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కనకమహాలక్ష్మి టూ వీలర్స్ అసోసియేషన్ తరపున గురువారం ఎమ్మెల్యే వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. నేషనల్ టూవీలర్స్ మెకానిక్ డే సందర్భంగా చీపురుపల్లి, గరివిడి, మెరకముడుదాం మండలాల పరిధిలో గల సుమారు 70 మంది మెకానిక్‌లు చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి ఆలయ సమీపంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే కళా వెంకటరావుకు అందజేశామన్నారు. కులమతాలకతీతంగా రాష్ట్రంలో సుమారు 8 లక్షల మంది మోటారు మెకానిక్‌లుగా చాలీచాలని రాబడితో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ప్రతి మెకానిక్‌కు కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వ గుర్తింపు ఇవ్వడంతో పాటు మెకానికుల కోసం సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేసి అదే బోర్డు ద్వారా గుర్తింపు పొందిన ప్రతి కార్మికునికి ప్రమాద బీమా, వైద్య సదుపాయం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్మిక శాఖ ద్వారా గుర్తింపు పొందిన మెకానిక్‌లకు షాపులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో టూ వీలర్స్ అసోసియేషన్ వెల్ఫేర్ భవన్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పోతుల రాము, అధ్యక్షులు గాడి నాని, ఉపాధ్యక్షులు కూనుబిల్లి రామలక్ష్మణల ఆధ్వర్యంలో స్థానిక జనసేన నాయకులు కోట్ల కృష్ణ సారధ్యంలో వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల మెకానిక్‌లు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - వంగర

కార్మిక హక్కుల రక్షణ కోసం ఈనెల 9న దేశవ్యాప్తంగా జరుగు సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోసిఐటియు మండల మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు 8 గంటల నుండి 10 గంటలకు పని గంటలు పెంచడం వల్ల కార్మికులపై పని భారం పెరిగి నిరుద్యోగం మరింత పెరుగుతుందన్నారు. ఆశ, అంగన్వాడీ, ఎండిఎం, పాఠశాల ఆయాలకు, గ్రీన్ అంబాసిడర్లకు బకాయి పడిన వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకులు, రైల్వే, ఎల్ఐసి, పోస్టల్ తదితర వాటిని ప్రైవేటీకరణ చేయడం ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

పదిమందితో నూతన కమిటీ ఎన్నిక

వంగర మండల కన్వీనర్‌గా వై అప్పలస్వామి, కో కన్వీనర్‌గా సిహెచ్ రూపవతి, కమిటీ సభ్యులుగా బి గౌరునాయుడు, ఎల్ శ్రీనివాసరావు, పి భూలోక, ఎ. లక్ష్మి, కృష్ణమూర్తి, వై జయలక్ష్మి, బి లలిత, ఎన్ లక్ష్మిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ

విజయనగరం టౌన్ :ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్స్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఇండియన్ క్రిస్టియన్‌డే వేడుకలను పురస్కరించుకుని ఏసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ ఎ.బి. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కనపాక లో ఉన్న లవింగ్ షఫార్డ్ అర్బన్ హోమ్ లో పిల్లలకు నోట్ పుస్తకాలు, కేక్, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. పాస్టర్ రవికుమార్, ఎ.బి.ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వరూప్ కుమార్, శాలిని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో పనిచేస్తున్న అధికారులందరూ గ్రామాల అభివృద్ధి కోసం పనిచేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. భోగాపురం మండలంలోని ముంజేరు తన స్వగృహంలో నాలుగు మండలాల ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, గ్రామ కార్యదర్శులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామ పంచాయతీల పనితీరు, ప్రజా సమస్యలు పరిష్కారం, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, దళిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా కార్యాలయాల పనివేళలను పాటించాలన్నారు. సచివాలయ స్థాయిలో ఫిర్యాదు రిజిస్టర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. పైప్ లైన్ లీకేజీ లేకుండా చూడాలని, నీటి వనరుల పరిసరాలను తప్పకుండా శుభ్రం చేయాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ఆలస్యం చేయకుండా క్లోరే నేషన్ చేయాలన్నారు. గ్రామపంచాయతీ తీర్మానాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పిఆర్ ఇంజనీర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ సాంకేతిక మార్గదర్శకత్వంలో పనిచేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లుపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూసే బాధ్యత అధికారులందరిపై ఉందని చెప్పారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు సూచించారు. గురువారం ఆయన అలుగోలు గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యం, తాగునీటి పథకాలు, ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలు పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ రామకృష్ణరాజు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి, తాగునీటి పథకాలు క్లోరినేషన్ జరిపించాలని తెలిపారు. వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని సూచించారు. వీధుల్లో మురుగు నీరు నిల్వకాకుండా బయటకు తరలించే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులకు పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణపై మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శంకర్‌జగన్నాథం, కార్యదర్శి మోహన్‌రావు పాలొగొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

వంగర: గ్రామాల్లో ప్రజలు పరిశుభ్రత పాటించాలని ఎంపిడిఒ ఎస్ రఘునాథ చారి, డిప్యూటీ ఎంపిడిఒ కెల్ల రామారావు అన్నారు. మండలంలోని శ్రీహరిపురం, బాగేంపేట గ్రామాలలో గురువారం పర్యటించారు. అక్కడ గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటా చెత్త సేకరణ చేపట్టిన పనులను, క్లోరి నేషన్ పనులను పరిశీలించారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా వేయాలని ప్రజలకు సూచించారు. ఎస్ డబ్ల్యుపి షెడ్ పరిశీలన అనంతరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాటిపూడి నీటిని సాగుకే వినియోగించాలి

మంత్రి కొండపల్లికి రఘురాజు వినతి

ప్రజాశక్తి -విజయనగరం

తాటిపూడి జలాశయం నీటిని రైతుల సాగునీటి కోసమే వినియోగించాలని రాష్ట్ర చిన్న, మధ్య తరహాపరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వినతి అందజేశారు. తాటిపూడి నీరు విడుదల సందర్భంగా ఈ నీరు రైతుల ప్రయోజనార్థమే వినియోగించబడుతుందని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే నీటిని బలవంతంగా పరిశ్రమ కోసం మళ్లించే అవకాశముందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోందని తెలిపారు. ఈ సందర్భంలో, ఈ జీవోలో తగిన సవరణలు చేసి, తా టిపూడి రిజర్వాయర్ నీటిని పూర్తిగా రైతుల ప్రయోజనానికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సంకల్పం, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాటానికి అన్ని వర్గాల ప్రజలూ సహకరించాలని ఎస్ఐ బి.గణేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంకల్పంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి జిల్లాలో డ్రగ్స్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించడానికి సంకల్ప రథాన్ని ప్రారంభించారన్నారు. దీనిలో భాగంగా సంకల్పం రథంలో విద్యార్థులకు టివిలో వీడియోలు ప్లే చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్లఫారాన్ని తొలగించాల్సిందే

ప్రజాశక్తి- మెంటాడ

కోళ్ల ఫారాన్ని తొలగించాలని కోరుతూ బిరసాడవలస గిరిజనులు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 29వ రోజుకు చేరాయి. దాదాపు నెల రోజులుగా దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోళ్లఫారం నుంచి వెలువడిన కాలుష్యాన్ని నివారించి, ఆరోగ్యాలను కాపాడాలని డిమాండ్‌చేశారు. కోళ్లఫారాన్ని అక్కడ నుంచి తొలగించే వరకూ ఆందోళన కొనసాగిస్తామని గిరిజనులు స్పష్టంచేశారు. కార్యక్రమంలో పలువురు గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

‘సదరం’ నమోదుకు అవకాశం

ప్రజాశక్తి-వేపాడ

వికలాంగుల సదరం స్లాట్ నమోదుకు ఈ నెల 5, 6వ తేదీల్లో అవకాశమిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తేది నుంచి ఎంపిక చేసుకున్న ఆస్పత్రుల్లో పరిశీలన ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జోరుగా పారిశుధ్య పనులు

వేపాడ : వేపాడ మండల కేంద్రంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, చెత్త తొలగించడంతోపాటు వర్షపునీరు నిల్వ లేకుండా బయటకు పోయేలా చర్యలు తీసుకున్నారు. ఈ పనులను ఎఒ మహేష్, సీనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని 132/33 కెవి కలవరాయి, బలిజిపేట, గ్రోత్ సెంటర్ సహారా, అరోరా, ఎండిఎ ఫీడర్ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేపట్టేందుకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇంచార్జి ఇఇ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెంట, కలవరాయి, పిరిడి, జగన్నాధపురం, పినపెంకి, బలిజిపేట, వంతరాం, బూర్జ, నెమలాం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. విద్యుత్ అంతరాయనికి సహకరించాలని కోరారు.

కలెక్టరేట్ ప్రాంతంలో..

విజయనగరం టౌన్ : శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఫీడర్ మరమ్మతుల కారణంగా కలెక్టరేట్ ప్రాంతంలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని ఆశాఖ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. కనపాక, సంజీవయ్య కాలనీ, కెఎల్ పురం, భవాని నగర్, బిసి కాలనీ, ఆర్టీవోఆఫీస్, సాయి లలితనగర్, సాయి కీర్తన నగర్, ద్వారపూడి రోడ్డులో విద్యుత్ నిలుపుదల చేస్తామని తెలిపారు.

పాతబగ్గాంలో గ్రామసభ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

పాతబగ్గాం గ్రామంలో పంచాయతీ సెక్రెటరీ రెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, పాలకవర్గ సభ్యులు, ఉపాధి హామీ పథకం ద్వారా చేయాల్సిన పనులు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. గ్రామంలో 50లక్షలతో త్వరలో చేపట్ట బోతున్న ఇంటింటి కుళాయి, మంచినీటి ట్యాంక్, సిసి రోడ్లు నిర్మాణం, మొదలగు వాటిపై సభలో తీర్మానం చేసి ఆమోదం తెలిపినట్లు తెలిపారు. గ్రామపెద్దలు చిన్నం నాయుడు, సన్యాసిరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

IN THE HON’BLE COURT OF THE SENIOR CIVIL JUDGE VIZIANAGARAM
I.A.707/2024 IN O.S.101/2024

Between:
Koyyana Jayamma & Others
....Petitioners/Plaintiffs
And
Duggu Krishna & others
....Respondents/Defendants

R7/D7. Duggu Eswara Rao, S/o Late Krishna, Karlam Village, Cheepurupalli Mandal, Vizianagaram Dist.

Please take notice that the above I.A and the above suit are posted to **8-7-2025** for hearing. Hence you shall attend either personally or by your pleader on that day at **10-30 AM,** before the Hon’ble Court failing which the matter will be decided in your absence.

P.R.V. Prasad
Advocate,
Vizianagaram